క్లుప్తంగా

ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలి


ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ సురేష్

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): మండలంలో ఉపాధి హామీ పథకం పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ సురేష్ ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో హార్టీకల్చర్ పనులను గుర్తించి రైతులతో చర్చించాలన్నారు. గ్రామాల్లో కంపోస్టు పిట్టు తయారీ పనులు ప్రారంభించాలన్నారు. గ్రామాల్లో కొలతల ప్రకారం పనులు జరిపించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో వాసంతి, ఈసీ ఈశ్వరి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

17 నుంచి ఉచిత ఆధ్యాత్మిక శిక్షణ తరగతులు

ఒంగోలు మెట్రో: ఒంగోలు కొండమీద శ్రీగిరి వెంకటేశ్వరస్వామి దేవస్థానం, చిన్మయ బాల విహార్ సంయుక్త నిర్వహణలో శ్రీగిరి గో క్షేత్ర భవనంలో ఈ నెల 17వ తేదీ నుంచి బాల బాలికలకు ఉచితంగా ఆధ్యాత్మిక శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. 5 నుంచి 17 సంవత్సరాల్లోపు వయసుగల వారు అర్హులు కాగా, ఆసక్తి గల విద్యార్థులు శ్రీగిరి వెంకటేశ్వర స్వామి దేవస్థానం కార్యాలయంలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కార్యక్రమ నిర్వాహకులు సూచించారు. ప్రతి ఆదివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. శిక్షణ తరగతుల సమయంలో తల్లిదండ్రులు తప్పనిసరిగా బాలవిహార్ ప్రాంగణంలో ఉండాలని నిర్వాహకులు సూచించారు.

మసీదుకు నిప్పు పెట్టిన వారిని శిక్షించాలి

ఒంగోలు వన్‌టౌన్: ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలం ధూపాడు గ్రామంలో మసీదుకు నిప్పుపెట్టిన వారిని కఠినంగా శిక్షించాలని ముస్లిం ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు ఎస్‌డీ సర్దార్, పఠాన్ కరీ ముల్లాఖాన్ డిమాండ్ చేశారు. స్థానిక సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో పురాతన మసీదులలో ధూపాడు మసీదు ఒకటన్నారు. సంఘ విద్రోహ శక్తులు మసీదులోకి ప్రవేశించి సామాన్లకు నిప్పుపెట్టడం దారుణమన్నారు. కాలి బూడిదైన సామాన్లను చూస్తే ఉద్దేశపూర్వకంగా చేసినట్లుగా ఉందన్నారు. స్థానికేతరులు గ్రామంలో ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నాలలో భాగంగానే నిప్పు పెట్టి ఉంటారని భావిస్తున్నట్లు తెలిపారు. ఈ సంఘటనపై పోలీసులు వేగంగా విచారణ నిర్వహించి నిందితులను శిక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌కే మహ్మద్ రఫీ, సయ్యద్ ఇస్మాయిల్, ఎస్‌కే అబ్దుల్ రవూఫ్, ఎస్‌డీ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

లైంగికంగా వేధిస్తున్నాడని మందలించినందుకు దాడి

ఒంగోలు టౌన్: ఒక వివాహితను నిత్యం లైంగికంగా వేధిస్తున్న ఆకతాయిని మందలించినందుకు అతను దాడి చేసి గాయపరిచిన ఘటన కొత్తపట్నం మండలంలో జరిగింది. బాధితుల కథనం ప్రకారం... కొత్తపట్నం మండలం మోటుమాల గ్రామానికి చెందిన పురిణి సీతారావమ్మ, సుబ్బారెడ్డి దంపతుల కుమారుడు నాగార్జున, నందిని కలిసి జీవిస్తుంటారు. వారి నివాసం పక్కనే ఉంటున్న చినిగే సాయిరెడ్డి జులాయిగా తిరుగుతుంటాడు. కొంతకాలంగా నందినిని సాయిరెడ్డి లైంగికంగా వేధిస్తున్నాడు. అసభ్యంగా కామెంట్లు చేయడం, ఇంటి ఎదురుగా మోటారు బైకుపై కూర్చుని అదేపనిగా హారన్ కొట్టడం లాంటి చర్యలకు పాల్పడుతున్నాడు. గంజాయి ముఠాతో తిరిగే అతడితో మనకెందుకులే అని నందిని కుటుంబం సర్దుకుపోతోంది. అతడు మరింత రెచ్చిపోవడంతో ఇటీవల సుబ్బారెడ్డి మందలించాడు. తననే మందలిస్తావా అంటూ సాయిరెడ్డి తన తండ్రి కొండలు, తల్లి సుబ్బమ్మ, మరో ఏడుగురితో కలిసి నందిని ఇంటికి వెళ్లి దాడి చేశాడు. సీతారావమ్మ తల పగలగొట్టడంతో ఆమె స్పృహ కోల్పోయారు. వెంటనే ఒంగోలు జీజీహెచ్‌కి తరలించి వైద్యం చేయగా, ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉంది. సంఘటనపై కొత్తపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీటీఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఒంగోలు సబర్బన్: స్థానిక కొత్తమామిడిపాలెంలోని గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ (జీటీఎస్)ను సద్వినియోగం చేసుకోవాలని ఒంగోలు నగర కమిషనర్ కే వెంకటేశ్వరరావు కోరారు. గురువారం నగర మేయర్ సుజాత, నగర పాలక సంస్థ ఇంజినీరింగ్, శానిటేషన్ సిబ్బందితో కలిసి జీటీఎస్‌ను పరిశీలించారు. ఆవరణలో నగరపాలక సంస్థ సిబ్బంది నిర్వహిస్తున్న వర్మీ కంపోస్ట్ తయారీని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఎక్కడా చెత్త కుప్పలు లేకుండా చెయ్యడమే ప్రధాన ధ్యేయంగా పెట్టుకున్నామన్నారు. అందులో భాగంగా ఇక్కడ వర్మీ కంపోస్ట్ ద్వారా ఎరువులు తయారు చేస్తున్నట్లు తెలిపారు.

ఒంగోలులో రెడ్ బుక్ రాజ్యాంగం

- వైఎస్సార్ సీపీ 16వ డివిజన్ అధ్యక్షునిపై అక్రమ కేసు
- ఎమ్మెల్యే దామచర్ల ఒత్తిడితో నాన్ బెయిలబుల్ సెక్షన్లు పెట్టి రిమాండ్‌కు తరలించి పోలీసుల వేధింపులు


మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకర్

ఒంగోలు టౌన్: ఒంగోలు నగరంలో టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారు. ఎస్టీ సామాజిక వర్గానికి చెంది ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో బాధితుడిగా ఉన్న వైఎస్సార్ సీపీ నాయకునిపై అక్రమ కేసు బనాయించారు. ఎమ్మెల్యే ఒత్తిడితో నాన్ బెయిలబుల్ సెక్షన్లు పెట్టి మరీ పోలీసులు రిమాండ్‌కు పంపించి వేధిస్తున్నారు. బాధిత కుటుంబం కథనం ప్రకారం.. నగరంలోని 16వ డివిజన్ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పొట్లూరు భాస్కర్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. ఆటో నడుపుకుని జీవనం సాగించే భాస్కర్‌కు ఒంగోలు కమ్మపాలేనికి చెందిన ఈదర కోటేశ్వరరావు అలియాస్ బాబికి భాస్కర్‌రావుతో గతంలో విభేదాలున్నాయి. ఆటో నడుపుకునే భాస్కర్ వ్యక్తిగత అవసరాల కోసం బాబి వద్ద రూ.60 వేలు తీసుకున్నాడు. వడ్డీతో సహా కట్టాలని బాబీ ఒత్తిడి చేశాడు. ఈ క్రమంలో కులం పేరుతో దూషించాడు. దాంతో భాస్కర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ సంఘటన 2023లో జరిగింది. మనసులో పెట్టుకున్న బాబీ.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రెచ్చిపోయాడు. ఇప్పుడు కేసు పెట్టరా నా కొడకా చూద్దామంటూ ఇటీవల భాస్కర్‌పై దాడి చేసి గాయపరిచాడు. అతడి ఆటోను ధ్వంసం చేశాడు. భాస్కర్ పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదు. తనపైనే కేసు పెడతాడా అని భాస్కర్ మీద బాబీ కక్ష పెంచుకున్నాడు. తనను ఆటోతో భాస్కర్ గుద్దాడని, తన చేయి విరిగిందని తాజాగా పోలీసులకు బాబీ ఫిర్యాదు చేశాడు. ఎమ్మెల్యే ద్వారా పోలీసులపై ఒత్తిడి చేయడంతో రంగంలోకి దిగిన తాలూకా పోలీసులు ఆఘమేఘాల మీద భాస్కర్‌ను అరెస్టు చేశారు. బుధవారం ఉదయం పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చి రాత్రంతా కూర్చోబెట్టారు. గురువారం కేసు నమోదు చేయడమే కాకుండా నాన్‌బెయిలబుల్ సెక్షన్లు పెట్టి రిమాండ్‌కు పంపించారు. ఎస్సీ, ఎస్టీ కేసులో బాధితుడైన భాస్కర్ మీదనే కేసు పెట్టి జైలుకు పంపించడంపై న్యాయవాదులు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు తాలూకా సీఐకు ఫోన్ చేసి మాట్లాడారు. తమ పార్టీ నాయకుల మీద తప్పుడు కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో బాధితుడిపైనే కౌంటర్ కేసు పెట్టడం ఎంత మాత్రం మంచిది కాదన్నారు. పోలీసులు రాజకీయ ఒత్తిళ్లకు లొంగి పనిచేయడం దురదృష్టకరమని అన్నారు.

ఎమ్మెల్యే ఒత్తిడితోనే కేసు...

భాస్కర్ మీద కేసు నమోదు చేయాల్సిందిగా ఒంగోలు ఎమ్మెల్యే నుంచి ఒత్తిడి వచ్చిందని తాలూకా సీఐ చెబుతున్నాడని, రాజకీయ ప్రయోజనాల కోసం ఒక ఎస్టీ సామాజికవర్గానికి చెందిన వ్యక్తి మీద అక్రమ కేసు నమోదు చేయడం దుర్మార్గమని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు కఠారి శంకర్ విమర్శించారు. తాలూకా పోలీసు స్టేషన్ వద్ద గురువారం మీడియాతో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులు, గిరిజనుల మీద దాడులు ఎక్కువయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధం లేని కేసుల్లో ఇరికించి వేధించడం ఎంత వరకు సమంజసమని ఎమ్మెల్యే దామచర్లను ప్రశ్నించారు. ఎమ్మెల్యే ఆఫీసు నుంచే ఫోన్లు వస్తున్నాయని పోలీసులు చెబుతున్నారని, ఒంగోలులో కూడా రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని ఆరోపించారు. కేవలం వైఎస్సార్ సీపీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నందుకే భాస్కర్‌ను తప్పుడు కేసులో ఇరికించారని, నాన్‌బెయిలబుల్ సెక్షన్లు పెట్టారని చెప్పారు. ఇప్పటికైనా తప్పుడు కేసులు పెట్టడం మానుకోవాలని హితవు పలికారు. శంకర్ వెంట వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ నాయకురాలు పేరం ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.


వృద్ధాశ్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున, డాక్టర్ జవహర్, తదితరులు

వృద్ధాశ్రమాన్ని ప్రారంభించిన బూచేపల్లి, మేరుగు

చీమకుర్తి: స్థానిక గాంధీనగర్‌లో ఖాదర్‌బాషా అనాథ వృద్ధాశ్రమాన్ని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున, డాక్టర్ బీ జవహర్ చేతుల మీదుగా గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ వృద్ధులకు నిస్వార్థంగా సేవలందించేందుకు ఖాదర్‌బాషా తన పేరు మీద అనాథ వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ఆశ్రమానికి ఇప్పటికే తన వంతు సహకారాన్ని అందించినప్పటికీ రానున్న రోజుల్లో ఆశ్రమంలోని వృద్ధులకు మరింత సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. మేరుగు నాగార్జున, డాక్టర్ బీ జవహర్, ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి మాట్లాడుతూ చీమకుర్తిలోని వృద్ధులకు ఆశ్రమం అండగా నిలుస్తుందని సంతోషం వ్యక్తం చేశారు. ఆశ్రమంలో 30 మంది వరకు ఉండేందుకు ఏర్పాట్లు చేసినట్లు వ్యవస్థాపకులు ఖాదర్‌బాషా తెలిపారు. 60 సంవత్సరాలు నిండి ఇంట్లో ఆదరణ లేని వృద్ధులను తమ ఆశ్రమంలో చేర్చుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో చీమకుర్తి జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ చీమకుర్తి పట్టణ అధ్యక్షుడు క్రిష్టిపాటి శేఖరరెడ్డి, కౌన్సిలర్లు పాటిబండ్ల గంగయ్య, మేకల యల్లయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తుమ్మల సుబ్బారావు, స్థానికులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులపై బెదిరింపులు ఆపాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చీకటి శ్రీనివాసరావు

ఒంగోలు టౌన్:

పారిశుధ్య కార్మికులను తొలగించడం, బెదిరింపులకు పాల్పడటం ఆపాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత రెండు మాసాలుగా పారిశుధ్య కార్మికులను పర్యవేక్షణ పేరుతో వేధిస్తున్నారని, చిన్నచిన్న పొరపాట్లను కూడా భూతద్దంలో చూపుతూ కార్మికులకు మస్టర్ వేయడం ఆపివేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నామంటూ విధులు కేటాయించడం లేదన్నారు. నగరంలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని, చనిపోయిన జంతువులను, మురుగుకాలువలను శుభ్రం చేస్తున్న కార్మికుల శ్రమను గౌరవించకుండా బెదిరింపు చర్యలకు పాల్పడటం ఎంత మాత్రం సమంజసం కాదన్నారు. జూలై 26వ తేదీ భాగ్యనగర్లోని ఒక ఇంటి యజమాని కనుమల్ల ఏసమ్మ అనే కార్మికురాలికి చెత్తతో పాటుగా అట్టముక్కలు, వాటర్ బాటిల్స్ ఇచ్చారని, వాటిని పుష్కార్టులో వేయడం జరిగిందని తెలిపారు. అయితే అట్టముక్కలు, వాటర్ బాటిళ్లను అమ్ముకుంటుందని ఫొటోలు తీసి కలెక్టర్, సీఎంకు పంపించామని చెప్పి ఉద్యోగం తీసేస్తామని బెదిరింపులకు పాల్పడడం బాధాకరమన్నారు. సదరు కార్మికురాలు అధికారులను వేడుకున్నప్పటికీ పట్టించుకోకపోవడంతో మానసిక ఒత్తిడికి గురై అనారోగ్యం పాలైందని చెప్పారు. జీవనోపాధి కోసం పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న దళితులను వేధించడం, మీరు గొడ్డు మాంసం తింటారు.. ఎన్నిసార్లు చెప్పినా మారరు అంటూ అధికారులు దూషించడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ యూనియన్ నగర అధ్యక్షుడు టి.మహేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 115 మంది మేస్త్రీలను విధుల నుంచి తొలగించారని, 60 ఏళ్లు నిండిన కార్మికులు 16 మందిని నిలిపివేశారని తెలిపారు. 11 మంది చనిపోగా, వారి కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించకుండా టీడీపీ, జనసేన కార్యకర్తలు 44 మందిని ఆగస్టు 1వ తేదీ విధుల్లోకి చేర్చుకున్నారని ఆరోపించారు. ఒకవైపు మేస్త్రీ వ్యవస్థ రద్దు చేసినట్లు చెప్పి ఇప్పుడు దాన్ని కొనసాగిస్తున్నారన్నారు. పాలకులు, అధికారుల ద్వంద్వ వైఖరి మానుకోవాలని, మున్సిపల్ కార్మికులను వేధించడం ఆపి వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో తంబి శ్రీనివాసరావు, రత్నకుమారి, టి.విజయమ్మ, కె.శ్రీనివాసరావు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అక్రమ వాడకంపై రూ.2,79,500 జరిమానా

కొత్తపట్నం: మండలంలో వివిధ రకాలుగా అక్రమంగా విద్యుత్ వాడుతున్న వారికి రూ.2,79,500 అపరాధ రుసుం విధించారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో గురువారం దాడులు నిర్వహించారు. 40 బృందాలుగా ఏర్పడి మండలంలోని 15 పంచాయతీల్లో విద్యుత్ సర్వీసులను తనిఖీ చేశారు. 47 సర్వీసుల ద్వారా అక్రమంగా విద్యుత్ వాడుతున్నట్లు గుర్తించి జరిమానా విధించారు. దాడుల్లో ఒంగోలు ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.హరిబాబు, డీపీఈ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.హైమావతి, డిప్యూటీ ఇంజినీర్ టి.శ్రీకాంత్, టౌన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కేవీ పాండురంగారావు, చీమకుర్తి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆర్.మోహన్‌రావు, ఒంగోలు డివిజన్ ఏఈలు, జేఈలు, ఎల్ఐలు, ఎల్ఎంలు, ఏఎల్ఎంలు పాల్గొన్నారు.

గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్లో చెయిన్ స్నాచింగ్

మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్లో ఫ్యాక్టరీకి వెళ్తున్న మహిళ మెడలోని మూడున్నర సవర్ల బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తులు గురువారం ఉదయం లాక్కెళ్లారు. మండలంలోని అన్నంగి గ్రామానికి చెందిన రాయపాటి హేమలత గ్రోత్ సెంటర్లోని ఫ్యాక్టరీలో పనిచేసేందుకు వెళ్తుండగా ఇద్దరు వ్యక్తులు మోటార్ సైకిల్‌పై వెనుకగా వచ్చి ఆమె మెడలోని గొలుసు లాగి తెంపుకుని పారిపోయారు. ఇటీవల మండలంలో వరుసగా దొంగతనాలు జరుగుతుండటంతో పాటు తాజాగా జరిగిన చెయిన్ స్నాచింగ్ ఘటనతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. మద్దిపాడు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శిగా కంకణాల


కంకణాల ఆంజనేయులు

ఒంగోలు టౌన్: వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శిగా కంకణాల ఆంజనేయులు ఎంపికయ్యారు. ఈ నెల 12, 13 తేదీల్లో కనిగిరిలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా మహాసభలలో ఈ ఎంపిక జరిగింది. అధ్యక్షునిగా నెరుసుల వెంకటేశ్వర్లు, 15 మంది ఆఫీస్ బేరర్లతో పాటు మొత్తం 25 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గురువారం ఒంగోలులోని సుందరయ్య భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కంకణాల ఆంజనేయులు, నెరుసుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పేదల కడుపులు నింపాల్సిన ఉపాధి హామీ పథకాన్ని అధికార పార్టీ నాయకులు, గ్రామాల్లోని పెత్తందార్లు అడ్డగోలుగా మెక్కుతున్నారని ఆరోపించారు. పనులు చేయకుండానే బిల్లులు చేసుకుంటున్నారని, పనిచేసిన కూలీలకు మాత్రం బిల్లులు మంజూరు కావడం లేదని విమర్శించారు. ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకునేందుకు ఉద్యమం చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో జాలా అంజయ్య, కొమ్మాలపాటి మాల్యాద్రి, మోజెస్, మల్లెల సంపూర్ణ, జీ మస్తాన్, వెల్లంపల్లి ఆంజనేయులు, బడుగు వెంకటేశ్వర్లు, గుమ్మా నాగయ్య, కె.వెంకటేశ్వర్లు, ఉబ్బా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు, లోకేష్‌లే రాజకీయాలు చేయాలా..?


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఒంగోలు టౌన్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌లు తప్ప ఇంకే విద్యార్థి రాజకీయాలు చేయకూడదా..ఇదేమ న్యాయమని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ వినోద్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ ప్రశ్నించారు. నగరంలోని మీడియా కెమెరామెన్ అసోసియేషన్ హాలులో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థులకు రాజకీయాలు వద్దన్నప్పుడు టీడీపీకి అనుబంధంగా తెలుగు విద్యార్థి సంఘాన్ని ఎందుకు కొనసాగిస్తున్నారో చెప్పాలన్నారు. విద్యా సంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించమని అడిగితే ఏకంగా విద్యార్థి సంఘాలను అణచివేసేలా ఉత్తర్వులు జారీ చేయడం ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. విద్యార్థి సంఘాలు చేసిన పోరాటాల వలన అనేక చట్టాలు అమలులోకి వచ్చాయని, విద్యా హక్కు చట్టం కూడా అలాంటిదేనని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లను నియమించాలని, సొంత భవనాలు నిర్మించాలని, ప్రయోగశాలలు ఏర్పాటు చేయాలని, మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచాలని, చదువుకున్న విద్యార్థులకు ఉద్యోగాలు ఇవ్వాలని అడగడం తప్పా అని నిలదీశారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజు దోపిడీని అరికట్టాలని, నిబంధనలకు వ్యతిరేకంగా పుస్తకాలు, షూలు, బెల్టులను విక్రయించకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రశ్నించడం తప్పెలా అవుతుందన్నారు. వివిధ కారణాలతో ప్రైవేటు విద్యా సంస్థల్లో పనిచేస్తున్న విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే ఎందుకిలా జరుగుతుందని అడగడం తప్పంటే ఎలా అని ప్రశ్నించారు. ఒక సిద్ధాంతానికి కట్టుబడి పోరాటాలు చేస్తున్న విద్యార్థి సంఘాలను నియంత్రించాలనుకోవడం సిగ్గుచేటన్నారు. విద్యార్థి సంఘాల పేరుతో కొందరు వ్యక్తులు చేస్తున్న అరాచకాలను కట్టడి చేయాలని, దానికి బదులుగా ఇంట్లో ఎలుకలుంటే ఇంటిని తగులబెట్టినట్లు విద్యార్థి సంఘాలను నియంత్రించాలను కోవడం మూర్ఖత్వం అవుతుందన్నారు. తక్షణమే విద్యార్థి సంఘాలను నియంత్రించేలా తీసుకొచ్చిన చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వీరాస్వామి, పీడీఎస్‌యూ నాయకులు శాంసన్, పి.మోషి, సురేష్, రఫీ, దావీదు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలి


కార్యక్రమంలో పాల్గొన్న ఏపీజీఈఏ నాయకులు

- పీఆర్‌సీ కూడా వెంటనే ప్రకటించాలి
- ఏపీజీఈఏ ఆధ్వర్యంలో రండీ టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమంలో నాయకుల డిమాండ్

ఒంగోలు సబర్బన్: ఉద్యోగులకు రావాల్సిన ఇంటీరియమ్ రిలీఫ్ (ఐఆర్) బకాయిలు వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) అనుబంధ విభాగం వాణిజ్య పన్నుల శాఖ జోనల్ అధ్యక్షుడు జాజుల నరసింహారావు డిమాండ్ చేశారు. ఒంగోలు నగరంలోని కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయంలో ఏపీజీఈఏ ఆధ్వర్యంలో గురువారం రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ సందేశాన్ని ప్రభుత్వ ఉద్యోగులకు వినిపించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ డీఏలు రావాల్సి ఉండగా, ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చే పరిస్థితి లేదని, సాధన కోసం కార్యాచరణపై త్వరలో నిర్ణయం తీసుకోవటం జరుగుతుందని అన్నారు. ఈ నెల 5వ తేదీ నుంచి ఏపీజీఈఏ ఆధ్వర్యంలో ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఉద్యోగుల సమస్యలపై చర్చిస్తున్నట్లు తెలిపారు. ఏపీజీఈఏ ఆధ్వర్యంలో మూడు నెలల పాటు ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై ప్రతి విభాగంలో అందరితో చర్చించిన తర్వాత ఎలాంటి కార్యాచరణ చేపట్టాలో నిర్ణయం తీసుకోవటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగులు, ఏపీజీఈఏ ఒంగోలు నగర అధ్యక్షుడు మోటా శ్రీనివాసరావు, మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ రజిత, మానస తదితరులు పాల్గొన్నారు.

పీ గుడిపాడులో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): సంతనూతలపాడు మండలంలోని పి.గుడిపాడు గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో గురువారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు బాలినేని కళ్యాణ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గుండా శ్రీనివాసరావు, ఎంపీటీసీ సుజాత, నాయకులు పాల్గొన్నారు.

అమ్మనబ్రోలు గ్రామంలో...

నాగులుప్పలపాడు: మండలంలోని అమ్మనబ్రోలు గ్రామంలో జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో గురువారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు పొద అపర్ణ, జిల్లా ఇన్‌చార్జి కొక్కెర శ్రీనివాస్‌యాదవ్, పొద వరప్రసాద్, హెచ్ఎం సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.


అమ్మనబ్రోలులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, నాయకులు

కారు - ద్విచక్ర వాహనం ఢీ

- ఇద్దరికి గాయాలు


సంఘటన స్థలంలో గాయపడిన యువకులు

నాగులుప్పలపాడు:

కారు - ద్విచక్రవాహనం ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన గురువారం మండలంలోని చదలవాడలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం పమిడిపాడుకు చెందిన పాలేటి ఆంజనేయులు, కొడివెండ్ల నారాయణస్వామి ద్విచక్రవాహనంపై ఒంగోలు నుంచి స్వగ్రామం వెళ్తున్నారు. 216వ నంబర్ జాతీయ రహదారిపై చదలవాడ వద్ద ఒక్కసారిగా రాంగ్ రూట్‌లోకి వెళ్లి నాగులుప్పలపాడు నుంచి ఒంగోలు వెళ్తున్న కారును ఢీకొట్టారు. ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరూ కిందపడి గాయాలవడంతో 108 వాహనంలో ఒంగోలులోని ఆస్పత్రికి తరలించారు.